సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు సమక్షంలో శుక్రవారం మైలవరం మండలంలోని పలు గ్రామాల నుంచి 600 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. -IIలో



కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి

కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాధి వస్తున్న నేపథ్యంలో కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధశాఖ అధికారి శారదమ్మ చెప్పారు. -IIలో

గరిష్టం/కనిష్టం
34.7/19.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 19.4 - 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'అంబేడ్కర్' ప్రవేశాల గడువు పొడిగింపు

వైవీయూ: డా.బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలు పొందేందుకు ఈనెల 29వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎం. వీరభద్రయ్య తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందగోరే అభ్యర్థులు కళాశాల స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి క్రికెట్ మ్యాచ్



వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా బీసీసీఐ అంతర్ రాష్ట్రాల అండర్-23 క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. టోర్నమెంట్‌లో భాగంగా ఆంధ్ర, రైల్వేస్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ నిర్వహణకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ (సీఏవైడీ) అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భరత్‌రెడ్డి, ఎ. రెడ్డిప్రసాద్ తెలిపారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ రత్నకుమారి

కడప రూరల్: కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓల నియామకాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 28 మందిలో 24 మంది నియామక పత్రాలను పొందారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం నియామకాలను చేపట్టినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరిండెంట్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ అతావుల్లా, బత్తనయ్య, వనీష తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

కడప ఎడ్యుకేషన్: కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డు అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ జ్యోతి తెలిపారు. కళాశాలలోని సివిల్, సిఎమ్ఈ, ఈసీఈ, ఈఈఈ బ్రాంచ్‌లకు 2023-24 విద్యా సంవత్సరం నుంచి మూడు సంవత్సరాలపాటు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందన్నారు. దీనివల్ల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించవచ్చని చెప్పారు. ఎన్‌బీఏ గుర్తింపు లభించేందుకు సహకారం అందించిన సాంకేతిక విద్యాశాఖ కమిషన్ నాగమణి, అధికారులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడికి వింత వైరస్



వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఇస్మాయిల్

లింగాల: వైఎస్సార్ జిల్లా లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన గొడుగు ఇస్మాయిల్(19) అనే యువకుడికి వింత వైరస్ సోకింది. లింగాల వైద్యాధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్మాయిల్‌ను నాలుగు నెలల క్రితం పిచ్చి కుక్క కరిచింది. పరిస్థితి విషమించడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యాధికారులు పరీక్షించి 20ఏళ్ల క్రితం వచ్చిన వింత వైరస్ ఈ యువకుడికి సోకిందని నిర్ధారించారు. ప్రస్తుతం యువకుడు స్విమ్స్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి తెలిపారు. కాగా, నాలుగు నెలల క్రితం మరో నలుగురు వ్యక్తులు కుక్క కాటుకు గురయ్యారు. ప్రస్తుతం వారికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలని డాక్టర్లు తెలిపారు.

వైభవం.. రథోత్సవం

- దేవునికడప జనసంద్రం
- భక్తుల జయజయధ్వానాల మధ్య కదిలిన కడపరాయుని రథం



దేవుని కడపలోని తిరుమాడవీధిలో భక్త జనం మధ్య స్వామివారి రథం (ఇన్‌సెట్) దేవేరులతో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి

కడప కల్చరల్: ఇసుకేస్తే రాలనంత జనం మధ్య కడప రాయుని రథం కదిలింది. బ్రహ్మదేవుడు సారథ్యం వహించినట్లుగా అలంకరించిన రథం విశ్వతేజోమూర్తి సూర్యుని సాక్షిగా మహా మేరు పర్వతంలా జనసంద్రం మధ్యన సాగింది. భక్తులు రథంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకుని జయజయధ్వానాలు చేస్తూ జన్మధన్యమైందని మైమరచిపోయారు. కడప రాయుని బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని నిర్వహించారు. మాడ వీధులన్నీ జనంతో నిండిపోగా మిద్దెలు, మేడలపై నుంచి కూడా భక్తులు రథంలోని దేవదేవుడిని తిలకించి పులకించారు.

కట్టలు తెగిన ఉత్సాహం

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామి వారిని ఉదయం రథంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు దర్శనాల కోసం భక్తులు బారులు తీరి వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం సరిగ్గా 2.40 గంటలకు ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు తొలి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చి రథాన్ని కదిలించారు. దేవునికడప, పాతకడప, మోడమీదిపల్లె యువత కట్టలు తెంచుకున్న ఉత్సాహంతో కదం తొక్కుతూ రథ చక్రాల కింద కొయ్య మొద్దులు వేసి వెదురు కర్రల సాయంతో ముందుకు కదిలించారు.

ముందువైపు అశేష జనసందోహం పోటీలుపడి గొలుసులతో రథాన్ని లాగుతుండగా, మొక్కులు గల భక్తులు రథ చక్రాల కింద గుమ్మడి కాయలను ఉంచి ఆ ముక్కలను ప్రసాదంగా స్వీకరించారు. అర్చకులు అడుగడుగునా రథంపై నుంచి ప్రజలకు స్వామి వారి హారతులిచ్చారు. రథంపై నుంచి యువతను ప్రోత్సహిస్తూ రథోత్సవం సక్రమంగా సాగేందుకు సూచనలిచ్చారు. భక్తుల గోవిందనామ స్మరణలతో దాదాపు నాలుగు గంటలపాటు దేవునికడప మార్మోగింది. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య సాయంత్రం 6.20 గంటలకు రథాన్ని ముందున్న చోటులో చేర్చారు. రాత్రి ధూళి ఉత్సవం నిర్వహించారు.

నేటి అలంకారాలు

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామిని సర్వభూపాల వాహనంపై మాడవీధుల్లో ఊరేగించనున్నారు. రాత్రి అశ్వవాహనంపై దేవదేవుడు కరుణించనున్నాడు.


డిప్యూటీ సీఎం పూజలు

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక నాయకులు జరుగు రాజశేఖర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు, సభ్యులతో కలిసి రథంపైకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. తర్వాత శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు, వేదాశీస్సులు అందజేశారు.



రథంలోని స్వామిని దర్శించుకుని వస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు



కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రీజియన్ పరిధిలోని ఆరు డిపోల నుంచి ఈనెల 23వ తేదీన అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం తిరువన్నామలైకి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ బస్సుల్లో రానుపోను చార్జిలు వసూలు చేయడం జరుగుతుందన్నారు.

- కడప డిపో నుంచి రాత్రి 9.00 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా సర్వీసు నడుస్తుందన్నారు. ఇందులో టిక్కెట్ ధర రూ. 1072గా ఉందన్నారు.
- బద్వేలు డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా, మరోబస్సు ఉదయం 7.00 గంటలకు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ. 1566, రూ. 1475గా చార్జీ ఉందన్నారు.
- మైదుకూరు డిపో బస్సు పోరుమామిళ్లలో ఉదయం 6.00 గంటలకు బయలుదేరి మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా, మరో బస్సు సాయంత్రం 6.00 గంటలకు కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ. 1414 చార్జీ ఉందన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మైదుకూరు,కడప మీదుగా తిరువన్నామలైకు సర్వీసులు వెళుతుందన్నారు. ఇందులో చార్జి రూ.1273గా నిర్ణయించారన్నారు.
- జమ్మలమడుగులో రాత్రి 8.00 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుందన్నారు. టిక్కెట్ రూ. 1352గా ఉందన్నారు.
- పులివెందుల నుంచి ఉదయం 7.00 గంటలకు పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు బస్సు వెళుతుందన్నారు. ఇందులో రూ. 1242 చార్జిగా ఉందన్నారు. జిల్లాలోని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు



మాట్లాడుతున్న వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య అంజనేయప్రసాద్, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వెంకటసుబ్బయ్య

వైవీయూ: విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు అంజనేయప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని జిల్లా కలెక్టరేట్‌లో ప్రముఖ విద్యాపోర్టల్ ఎడెక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకునే కార్యక్రమానికి సంబంధించిన సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎఫ్‌యూ, వైవీయూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎఫ్‌యూ వీసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నతవిద్యలో ఉపాధి, ఉద్యోగసాధనే లక్ష్యంగా సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. మానవవనరుల మీద పెట్టుబడి అన్నది ఒక ప్రధాన అంశంగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతవిద్యను చదివేందుకు ఫీజురీయింబర్స్‌మెంట్, వసతిదీవెన అందిస్తోందన్నారు. డిగ్రీలో బైలింగువల్ టెక్ట్‌బుక్స్ తీసుకురావడంతో పాటు, పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో వైవీయూ అధికారులు ఆచార్య ఏజీ దాము, ఏఎఫ్‌యూ డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మనోహర్, వై.అనిల్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న తోడు లక్ష్యాన్ని అధిగమించాలి

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తి వ్యాపారుల ఆర్థిక బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం తొమ్మిదో విడత లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ విజయరామరాజు చెప్పారు. శుక్రవారం తన చాంబర్‌లో డీఆర్‌డీఏ, మెప్మా, బ్యాంకు అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో 10,290 మంది చిరు వ్యాపారులకు రూ. 10.29 కోట్ల రుణ లక్ష్యాన్ని ఆయా బ్యాంకులకు నిర్దేశించామని పేర్కొన్నారు. ఈనెలలోపే లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించి రుణ సదుపాయం కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు, నివాస గృహాలు అందుతున్నాయా? లేదా? అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

- కేంద్రీయ విద్యాలయంలో విద్యా ప్రమాణాలు పెంపొందించడంతోపాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శుక్రవారం విద్యాలయ యాజమాన్య కమిటీ సమావేశంలో మాట్లాడారు. రానున్న టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. విద్యాలయ యాజమాన్య కమిటీ సభ్యులు హేమాంగ్ వెంకటేశ్, ప్రభాకర్‌నాయుడు, ఐడీపీఎస్ ప్రధానాచార్యులు హరికృష్ణ, ప్రిన్సిపాల్ మునేష్ మీనా పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్ని అవసరమైన ఏర్పాట్లపై అధికారులు,సిబ్బందిని సర్వం సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్)ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలతో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, జేసీ గణేష్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ చంద్, ఏఎస్పీ సుధాకర్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషలు హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1941 పోలింగ్ స్టేషన్ల వద్ద ర్యాంపు, వీల్ చైర్స్, విద్యుత్, వెబ్ కాస్టింగ్ చేసేందుకు అవసరమైన విద్యుత్ సౌకర్యాల వంటి వసతలకల్పనకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యం మేరకు..జిల్లాలో అన్ని పనులను పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద వెబ్ కాస్టింగ్,మొబైల్ కనెక్టివిటీ వంటి సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు.ఈఆర్వోలు కడప, జమ్మలమడుగు ,ప్రొద్దుటూరు మధుసూధన్, శ్రీనివాసులు, కౌసర్ బాను, ఎస్‌ఐసీ అధికారి విజయ్ కుమార్, సిపిఓ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ విద్య

- 2024-25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం
- విద్యాహక్కు చట్టం కింద 1వ తరగతిలో ప్రవేశాలు



కడప ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం కింద పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి స్కూల్లో చదివే సదవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ మేరకు 2024-25 విద్యా సంవత్సరానికి ముందస్తుగా నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారనుంది. విద్యాహక్కుచట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది.

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి...

విద్యాహక్కుచట్టం -2009 ప్రకారం ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలని ఉన్నా గత పాలకులు దీని పట్టించుకోలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో కూడా పేద విద్యార్థులకు విద్యావకాశం కల్పించాలనే లక్ష్యంతో 25 శాతం సీట్లు ఇచ్చే అంశాన్ని సీరియస్‌గా తీసుకుని అమలుకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏటా 1వ తరగతిలో అర్హులైన పేద విద్యార్థులు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పించేందుకు వచ్చే విద్యా సంవత్సరంలో ఇప్పటి నుంచే చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యశాఖ కమిషనర్ విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 25 శాతం ఉచిత సీట్లకు సంబంధించి ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్సీ, స్టేట్ సిలబస్ అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు 1వ తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది. ప్రవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఈనెల 6వ తేదీ నుంచి సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు.

ఇదీ షెడ్యూల్..

- ఈనెల 20వతేదీ వరకు సీఎస్ఈ. ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టర్‌లో ఐబీ, ఐఈఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలయ్యే ప్రవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల రిజిస్ట్రేషన్
- ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు స్టూడెంట్ రిజిస్ట్రేషన్ విండో ఆన్ ది పోర్టల్
- మార్చి 20 నుంచి 22 వరకు స్టూడెంట్ అప్లికేషన్ ఎలిజిబిలిటీ డిటర్మినేషన్ త్రూ జీఎస్‌డబ్ల్యూఎస్ డేటా
- ఏప్రిల్ 01న లాటరీ ద్వారా మొదటి విడదల జాబితా పబ్లికేషన్
- ఏప్రిల్ 02 నుంచి 10 వరకు ఆయా పాఠశాలల్లో కన్ఫర్మేషన్ ఆఫ్ స్టూడెంట్ అడ్మిషన్స్
- ఏప్రీల్ 15న లాటరీ ద్వారా రెండో విడత బాబితా ప్రచురణ
- ఏప్రిల్ 16 నుంచి 23 వరకు ఆయా పాఠశాలల్లో కన్ఫర్మేషన్ ఆఫ్ స్టూడెంట్ అడ్మిషన్స్

పేద విద్యార్థులకు వరం



విద్యాహక్కుచట్టం ప్రకారం పేద విద్యార్థులకు 1వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది పేద, మధ్య తరగతి విద్యార్థులకు వరం లాంటిది. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – మర్రెడి. అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

పక్కా అమలుకు సూచనలు



వచ్చే విద్యా సంవత్సరంలో అమలుకు ఇప్పటి నుంచే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఆర్‌టీఈ చట్టం ప్రకారం 1వ తరగతిలో ప్రవేశాలకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంఈఓలకు సూచనలిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలను తప్పని సరిగా పాటించాలి. – ఎద్దుల రాఘవరెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నూతన కమిటీ ఎన్నిక

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా యువజన విభాగం నూతన కమిటీని ఎంపిక చేస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి(బద్వేల్), ఉపాధ్యక్షులుగా టి. సురేష్ బాబు(కడప), ఏ. దస్తగిరి(మైదుకూరు), ప్రధాన కార్యదర్శులుగా సి. సుమంత్‌యాదవ్(జమ్మలమడుగు), కె. మునిశేఖర్‌రెడ్డి(కడప), ఎల్. రామమల్లేశ్వరరెడ్డి(పులివెందుల), కె. శ్రీనివాసులరెడ్డి(కమలాపురం), పి. నాగార్జునరెడ్డి(మైదుకూరు), సి. గిరి ప్రణీత్‌రెడ్డి, కె. గంగిరెడ్డి(బద్వేల్), కార్యదర్శులుగా ఎస్. ప్రణీత్(బద్వేల్), ఎం. జిలాన్‌బేగ్(కడప), కిరణ్‌కుమార్ రెడ్డి, జి. మైసూరారెడ్డి(కమలాపురం), ఎస్. మహబూబ్‌బాషా, ఎస్. వెంకటసుబ్బయ్య(జమ్మలమడుగు), డి. పాపయ్య, కె. శివకుమార్‌రెడ్డి(పులివెందుల), ఎం. శివశంకర్‌రెడ్డి(మైదుకూరు), వై రవికుమార్(కడప), ఎస్. నరసింహారెడ్డి, ఏ. సుబ్బారెడ్డి(బద్వేల్), జాయింట్ సెక్రటరీలుగా ఎస్. శివశంకర్, ఏ. రాంబాబు(కడప), ఎం. సంతోష్ కుమార్‌రెడ్డి, ఎస్. శశిధర్‌రెడ్డి, డి. గంగాధర్‌రెడ్డి(కమలాపురం), వై. శివశంకర్‌రెడ్డి, పి. రాజు(జమ్మలమడుగు), పి. జశ్వంత్‌రెడ్డి(పులివెందుల), ఎం. యల్లారెడ్డి, ఎం. వినయ్ కుమార్‌రెడ్డి(మైదుకూరు), బి. వంశీవరప్రసాద్, టి. సాయి(కడప), వెల్లాల పుల్లయ్య, పి. ప్రసాద్, బి. సురేష్ బాబు(బద్వేల్)లు నియమితులయ్యారు.

22న పాస్టర్ల సదస్సు

కురబలకోట: రాయచోటిలోని ఇక్తూస్ కొత్త చర్చిలో ఈనెల 22న దైవ సేవకుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆహ్వానితులు పాస్టర్ అంజల బాబు, దివ్య శుక్రవారం తెలిపారు. బ్రేక్ త్రూ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని కట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అట్లూరు మండలం సూరేపల్లెకు చెందిన అయ్యావారయ్య(62) తన సొంత పనిపై శుక్రవారం మోటార్ బైక్‌లో పెండ్లిమర్రి మండలం ఎల్లటూరుకు వెళ్తుండగా.. మార్గంమధ్యలో కట్ట వద్ద పెద్దపుత్త వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అయ్యవారయ్య తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతుని కుమారుడు భీమయ్య ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆర్టీసీకి ఒక్క రూపాయి ఇవ్వని చంద్రబాబు


మాట్లాడుతున్న రాజారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పద్నాలుగు ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు ఆర్టీసీకి ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదని ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ గ్యారేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జీవం పోశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు నెలవారి జీతాలతోపాటు ఆధారిత అలవెన్సులను చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున ఫిబ్రవరి నెల నుంచి ఉద్యోగులకు చెల్లింపులు జరుగుతాయన్నారు. 2023 జూలై 25 కంటే ముందు ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న అన్ని క్రమశిక్షణా కేసులను ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల నిబంధనల ప్రకారం రెండు నెలల్లోపు తగిన చర్యలు తీసుకునేందుకు జిల్లా రీజినల్, జోనల్ స్థాయి అధికారులకు ఎండీ సర్క్యులర్ రూపంలో ఆదేశాలు జారీ చేశారన్నారు. త్వరలో రిటైర్డ్ అవుతున్న ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు. ఆర్టీసీ పీటీడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈయూ, ఎన్‌ఎంయూ, వైఎస్సార్ అసోసియేషన్లకు గుర్తింపును ప్రసాదించి ఆర్టీసీ ఉద్యోగుల పక్షపాతిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, డీఎం డిల్లీశ్వరరావు, అధికారులు కన్యాకుమారి, మంజుల, యూనియన్ నాయకులు బాబా ఫకృద్దీన్, కేకే కుమార్, సగినాల శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- మైలవరం మండలంలో 600 కుటుంబాలకు పార్టీ తీర్థం
- పలు గ్రామాల్లో పర్యటించిన రీజనల్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు
- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కలిసి ప్రచారం


సురేష్‌బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పీఆర్ వర్గీయులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ఊపందుకున్నాయి. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు శుక్రవారం మైలవరం మండలంలో విస్తృతంగా పర్యటించారు. నవాబుపేట, దుగ్గనపల్లె, గొల్లపల్లె, వద్దిరాల, దొడియం, నక్కవానిపల్లె, బుచ్చంపల్లె, బోగాలకట్ట, బొగ్గులపల్లె, దొమ్మరనంద్యాల, గంగులనారాయణపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మైలవరం మండలంలోని పలు గ్రామాల నుంచి 600 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పలు గ్రామాల్లో సుధీర్‌రెడ్డి వర్గం, రామసుబ్బారెడ్డి వర్గం అని ఉండేవని, ఇప్పటి నుంచి ఆ రెండు వర్గాలు కలిసి వైఎస్సార్ వర్గంగా పని చేస్తాయని పేర్కొన్నారు. రాబోయే రెండు నెలలు ప్రతి కార్యకర్త వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేయాలని తెలిపారు. కాగా సురేష్‌బాబు వెంట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కలిసి తిరగడంతో పార్టీ వర్గాల్లో జోష్ కనిపించింది. ఇరువురు నాయకులు కలసి పల్లె పల్లె తిరుగుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని పిలుపునివ్వడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. కాగా మూడేళ్ల క్రితం రామసుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరినప్పుడే.. చాలా గ్రామాల్లోని ఆయన అనుచర వర్గం వైఎస్సార్‌సీపీలోకి వచ్చింది. అయితే అక్కడక్కడా కొందరు నేతలు పార్టీలోకి చేరకుండా స్తబ్ధుగా ఉన్నారు. ప్రస్తుతం వీరందరినీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సు.దీర్‌రెడ్డికి పరిచయం చేసి వందలాది కుటుంబాలను సురేష్‌బాబు పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ లక్ష్మయ్య యాదవ్, కల్లుట్ల సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామయ్య, మాజీ సర్పంచ్ రమణయ్య, శివశంకర్‌రెడ్డి, తొర్రివేముల గురివిరెడ్డి, పుల్లారెడ్డి, శెట్టిపల్లె శంకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, విజయుడు, హుస్సేన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, టీబీహెచ్‌ఎల్సీ చైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, చేరెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంపలాకు రామాంజనేయ యాదవ్, నారపురెడ్డి జగదీశ్వరరెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి, మిలటరీ గుర్విరెడ్డి, దొంతిరెడ్డి నారాయణరెడ్డి, యనమల పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను లాభాల బాటలో నడిపించాలి


మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : వ్యవసాయ, అనుబంధ రంగాలను పటిష్టం చేసి రైతులను లాభాల బాటలో నడిపించి ఆర్థికంగా బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జేసీ గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 1.49 లక్షల హెక్టార్లకు గాను 1,12,761 హెక్టార్లలో సాగు చేయడం జరిగిందన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్‌లో లక్ష్యానికి మించి 104.96 శాతం ఈ–క్రాప్ నమోదైనట్లు తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ రబీ సీజన్‌లో 2,28,530 మంది రైతులకు గాను 81 శాతం క్రాప్ లోన్, టర్మ్ లోన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 2022 సంవత్సరానికి గాను క్రాప్ ఇన్సూరెన్స్ కింద 78,659 రైతులకు వెదర్ బేస్డ్ స్కీం కింద రూ.203,50,46,987లను మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందన్నారు. గ్రామాల వారీగా ఆర్బీకేల పరిధిలో వ్యవసాయ సహాయకులు సీజన్ వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, వాటికి ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ, ఆయా పైర్లకు అందాల్సిన పోషక విలువలు, ఎరువుల వాడకం మొదలైన ప్రక్రియల నిర్వహణపై ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. అంతకు ముందు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖలు సాధించిన ప్రగతిని, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలును, ఆర్బీకేల సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రవీంద్రారెడ్డి, సీఎంఎస్‌ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) డీపీఎం రామకృష్ణ, డీసీఓ సుభాషిణి, ఎల్‌డీఎం దుర్గా ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ శ్రీనివాసులరెడ్డి, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, సహకార, పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత


మద్యం బాటిళ్లతో సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

వేంపల్లె : మండల పరిధిలోని ముతుకూరు గ్రామంలో భారీగా అక్రమ మద్యం పట్టుకున్నట్లు వేంపల్లె సీఐ చాంద్‌బాషా తెలిపారు. స్థానిక వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి అక్రమ మద్యంపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ముతుకూరు గ్రామానికి చెందిన ఎం.వెంకటరమణ వద్ద సుమారు 102 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్ విధించినట్లు చెప్పారు. దాడుల్లో పోలీసు సిబ్బంది వీరన్న, మహమ్మద్ ఆలీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం నుంచి పెన్నాకు నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

జమ్మలమడుగు : సరైన వర్షాలు లేకుండా రైతులు వేసిన రెండో పంటకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మైలవరం జలాశయం దక్షిణ కాలువ ద్వారా పెన్నా నదిలోకి నీటిని విడుదల చేయడం జరిగిందని రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మైలవరం జలాశయం దక్షిణ కాలువ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వేసిన పంటలను ఎండిపోకుండా కాపాడి.. వారిని గట్టెక్కించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీంతో అధికారులు రైతుల పంటలను రక్షించాలనే ఉద్దేశంతోపాటు, తాగునీటి అవసరాలకు రోజుకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. మైలవరం జలాశయంలో నీరు తక్కువగా ఉండటంతో గండికోట ప్రాజెక్టు నుంచి రోజుకు ఐదు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలి మైలవరం జలాశయంలో 2.5 టీఎంసీల నీరు నిల్వ ఉంచిన తర్వాత.. మైలవరం గేట్ల ద్వారా పెన్నానదిలోనికి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అధికారులతో ఈ విషయంపై చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, రామాంజనేయుల యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ ఎంపికలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు చక్కటి ఆటతీరును కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావాలని సూచించారు. ఏపీ పీఈటీఎస్ అండ్ ఎస్‌ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రవీణ్‌కిరణ్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య, సంయుక్త కార్యదర్శి ఆర్. సునీల్, కోశాధికారి సి.కొండయ్య, కబడ్డీ కోచ్ ఆర్.వి. శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లును ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగార్జున, విశ్వనాథ్, చంద్రావతి, లీలావతి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

కమలాపురం : కమలాపురం పట్టణ పరిధి క్రాస్ రోడ్డు సమీపంలోని చెప్పలి రోడ్డులో శుక్రవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగినట్లు ఎస్‌ఐ హృషికేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెప్పలి రోడ్డులో నివాసం ఉంటున్న మీగడ చెన్నారెడ్డి భార్య గంగమ్మ అనే 65 ఏళ్ల వృద్ధ మహిళ ఇంటి ముందు మంచంపై కూర్చుని ఉండగా.. సుమారు 25 ఏళ్ల వయసు గల ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు చైన్‌ను అపహరించుకుని పక్కనే ఉన్న కంపచెట్లలో నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అనుమానితులను విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సంతృప్త స్థాయిలో

ప్రజలకు పథకాలు అందించాలి

కలెక్టర్ విజయ రామరాజు



కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్‌రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న హౌసింగ్ పట్టాల రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ అసైన్డ్, చుక్కల భూములు, మూడవ దశ రీ సర్వే, పంచాయతీ రాజ్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ (నరెగా), రబీ పంటలు, తాగు నీరు, కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, నేషనల్ ఇమ్యునైజేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఏపీఐఐసీ ప్రాజెక్టుల భూ సమస్యలు తదితర అంశాలపై.. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ విజయ్ రామరాజుతోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సచివాలయాల్లో చేపట్టిన హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్, డిస్ట్రిబ్యూషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలనే లక్ష్యం మేరకు అధికారులు నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు, ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మూడవ దశ రీ సర్వేను పకడ్బందీగా ఎక్కడా పెండింగ్ లేకుండా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలోని అన్ని హౌస్ హోల్డ్స్‌కి కుళాయి కనెక్షన్ అందించామన్నారు. వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎక్కడా కూడా తాగునీటి కొరత లేకుండా మంచినీటి పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వివిధ అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ నాగరాజు, సీపీఓ వెంకటరావు, పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా

దేవదాయ శాఖ ఈఓ వ్యవహారం

గోపవరం : బద్వేలు దేవదాయ శాఖ ఈఓ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ రెడ్డిపల్లె గోవిందరెడ్డి, ఈఓ శివయ్య మధ్య గత కొన్ని నెలలుగా వివాదం చోటు చేసుకుంది. ఆలయానికి సంబంధించిన నిర్ణయాలను చైర్మన్‌కు తెలియకుండానే ఈఓ తీసుకుంటుండటంతో వివాదం మరింత పెద్దదైంది. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 2022 నవంబర్ 11 నుంచి 2023 నవంబర్ 17 వరకు డ్రా చేసిన సుమారు రూ.18 లక్షలకు సంబంధించి ఎలాంటి లెక్కలు చూపలేదని చైర్మన్ ఈఓను ప్రశ్నించారు. మల్లెంకొండేశ్వరస్వామి దేవస్థానంలో తలనీలాల సేకరణకు ఈ నెల 5వ తేదీన దేవదాయశాఖ కార్యాలయంలో వేలం పాట నిర్వహించినా.. తనకు సమాచారం ఇవ్వలేదని చైర్మన్ ఆరోపిస్తున్నారు. అలాగే రెండవ విడత 15వ తేదీన నిర్వహించిన వేలంలో రూ.3.82 లక్షలు పాటదారుడు పాడినా.. మళ్లీ వాయిదా వేయడంలో ఆంతర్యమేమిటని ఈఓను చైర్మన్ ప్రశ్నించారు. గత ఏడాది నిర్వహించిన శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి కూడా ఈఓ పాలక మండలికి సహకరించలేదని ఆరోపించారు. బ్యాంకు నుంచి డ్రా చేసిన రూ.18 లక్షలకు సంబంధించి ఖర్చు చెప్పాలని శుక్రవారం ఈఓను చైర్మన్ నిలదీశారు. ఈఓ పొంతన లేని సమాధానం చెప్పడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. మార్చి 8న శివరాత్రి పర్వదినం సందర్భంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో కొండపైన, కొండ దిగువన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. దేవదాయశాఖ, పాలకమండలి సమన్వయంతోనే బ్రహ్మోత్సవాలు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఈఓ, చైర్మన్ మధ్య వివాదం కొనసాగుతుండటంతో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. చైర్మన్ చేసిన ఆరోపణలపై ఈఓ శివయ్యను సాక్షి వివరణ కోరగా డ్రా చేసిన నగదుకు సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, కావాలనే చైర్మన్ తనపై రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. తలనీలాల సేకరణకు నిర్వహించిన రెండు దఫాల వేలంపాటలో కూడా సరైన ధర పలకకపోవడంతో వాయిదా వేయడం జరిగిందని, మరోమారు వేలంపాట నిర్వహించి హెచ్చు పాటదారుడికి తలనీలాల సేకరణను అప్పగిస్తామన్నారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగేందుకు ఆస్కారం ఉండదని ఈఓ తెలిపారు.

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి

కొండాపురం : మండల పరిధిలోని సంకేపల్లె, కొత్తపల్లె గ్రామాల సమీపంలో 30 గొర్రెపిల్లలను కుక్కలు కరచడంతో చనిపోయినట్లు గొర్ల కాపరి రవీంద్ర శుక్రవారం తెలిపారు. రవీంద్ర కె.సుగుమంచిపల్లె పునరావాస కేంద్రంలో నివాసం ఉంటూ గొర్లు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంకేపల్లె, కొత్తపల్లె గ్రామల మధ్యలో కలం దొడ్డిలో గొర్రె పిల్లలు ఉండగా.. ఎవరూ లేని సమయంలో కుక్కలు దాడి చేశాయి. 30 గొర్రెపిల్లలు చనిపోయి, రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని గొర్రెల యజమాని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరుతున్నారు.



ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అన్నీ కూడా ఉచితంగా తీసుకోవడం జరిగింది. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రావాలంటే మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకునే వాళ్లం. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణపత్రాలు అన్నీ కూడా ఉచితంగా సచివాలయం ద్వారా అందజేస్తున్నట్లు వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణపత్రాలు వచ్చాయి. అంతేకాకుండా ఈబీసీ నేస్తం ద్వారా రూ.15 వేలు తీసుకున్నాం. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కూడా అర్హులైన వారికి ఇస్తుండటంతో మేము ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటాం.

– బాదిరెడ్డి రత్నమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

అమ్మఒడితో ఆసరా



మాది కాశినాయన మండలం ఆకులనారాయణపల్లె గ్రామం. నా భర్త హరిబాబు మగ్గం నేస్తుంటాడు. అది కూడా సక్రమంగా జరగడం లేదు. మాకు ఇద్దరు పిల్లలు. మా కుమార్తె ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. కుమారుడు 4వ తరగతి చదువుతున్నాడు. నేను కూలీ పనికి వెళుతుంటాను. మా ఇద్దరి సంపాదనతోనే మా కుటుంబం గడవాలి. పిల్లల పోషణ, ఇద్దరి పిల్లలను చదివించడం మాకు ఇబ్బందిగా ఉండేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు బ్యాంకు ఖాతాలో వేసి మమ్మల్ని ఆదుకుంటున్నారు. కుమార్తె చదువుకు ఆసరాగా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం వలన పిల్లలను బాగా చదివించుకుంటున్నాము. ఇప్పటికి మాకు మూడు విడతలు అమ్మఒడి అందింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– రెబ్బారమాదేవి, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

ఇల్లు మంజూరైంది



రోజూ కూలికి వెళితేనే మా జీవనం సాగుతుంది. కనీసం సెంటు స్థలం కూడా లేదు. అత్త, మామలు అంతా ఒకే ఇంట్లో ఇరుకుగా ఉంటున్నాము. గత ప్రభుత్వంలో చాలా సార్లు ఇంటి స్థలం కోసం పలుమార్లు అర్జీలు పెట్టుకున్నాను. జన్మభూమి కమిటీవారు అర్జీని తీసేస్తూ వచ్చారు. ఎవరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చిన తరువాత ఆఫీసుల చుట్టూ తిరగ కుండానే నాకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరైయింది. ఇప్పుడు నేను వంతాటిపల్లి గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాను. జగన్ పుణ్యమా అని నాకు కూడా సొంత ఇండ్లనేది ఉంది.

– ఉన్నం రెడ్డెమ్మ, వంతాటిపల్లి, సిద్దవటం మండలం

కోళ్ల పెంపకందారులు

అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ



కడప అగ్రికల్చర్ : నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలో కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారితమైందని, కావున వైఎస్ఆర్ జిల్లాలోని కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. స్థానికంగా ఆమె శుక్రవారం మాట్లాడుతూ కోళ్ల పెంపకందారులు ఈ వ్యాధి గురించి చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఎక్కువ సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవిస్తే స్థానిక పశు వైద్యాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని తెలిపారు. జిల్లాలో ఉన్న పశువైద్యులందరికీ బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రబలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణను కూడా ఇచ్చామన్నారు. ఈ వ్యాధి కోళ్లకు సోకి కోళ్ల నుంచి మనుషులలో ఊపిరితిత్తులకు సంబంధించిన రుగ్మతలను కలుగ చేస్తుందన్నారు. కావున కోళ్లఫారం యజమానులు, కోళ్ల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పక్క జిల్లా అయిన నెల్లూరు జిల్లా నుంచి కోళ్లను కొనుగోలు చేయడం గానీ కోళ్ల దాణాను కొనుగోలు చేయడం కానీ నిషేధించడం జరిగిందన్నారు. అందరూ ఇది గమనించి జాగ్రత్తగా ఉండావలసిందిగా తెలియజేశారు. బద్వేల్ పట్టణంలోని పలు కోళ్ల ఫారాలను పశు వైద్యసిబ్బంది సందర్శించి వ్యాధి నిర్ధారణ కోసం తీసకోవాల్సిన జాగ్రత్తలకు రైతులకు తెలియజేశారన్నారు. సరిహద్దు ప్రాంతాలైన నెల్లూరు జిల్లాకు చెందిన పిపి కుంట, ప్రకాశం జిల్లా సమీపంలోని పోరుమామిళ్ల ప్రాంతాలలో కోళ్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు కూడా ప్రజలంతా బర్డ్ ఫ్లూతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారన్నారు. కావున కోళ్ల యజమానులతోపాటు కోళ్ల ఫారం నిర్వాహకులు జాగ్రతగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా కోళ్లు చనిపోతే కాల్చి పూడ్చి పెట్టాలని తెలిపారు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.





భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరపు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెను కాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.

ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...



ముందస్తు ప్రణాళిక ...
పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.



అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...
పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. స్నేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వస్తారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి... పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.


క్యాటరింగ్: పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.

అలంకరణ సామగ్రి
పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



హనీమూన్ ట్రిప్... పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.

● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి ● కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది ● చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది ● నోటి దుర్వాసన ఉంటుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది ● వాంతి వచ్చినట్లుగా... వికారంగా అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

టపైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతో పాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

లైఫ్@360




శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్



ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్‌లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

డార్క్ చాకొలేట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయులను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది. మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.



సినిమా

దేవర డేట్ ఫిక్స్


● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం


● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎస్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం


● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?


● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.

మళ్లీ వస్తున్నాడు జోకర్


● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ' సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్


● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.


యుద్ధానికి సిద్ధం!


● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య


● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...


● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వవ్వారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...


● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు


● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్శికా జంటగా చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘురామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చందమామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.